ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శుక్రవారం 23 ఆగస్టు 2024





వికారాబాద్‌లోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్ కళాశాల) ప్రతిభ రోజు రోజుకు మసకబారుతోంది. ఇక్కడ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో కొనసాగుతున్న డైట్ కోర్సులో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 225 మంది విద్యార్థులున్నారు. వారికి కేవలం ఏడుగురు గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగుతోంది. ఇక్కడ మొత్తం 29 పోస్టులు ఉండగా.. ఒక్కరే రెగ్యులర్ అధ్యాపకుడు ఉండటం గమనార్హం. అన్ని సబ్జెక్టులు భోదించేవారు లేక సకాలంలో సిలబస్ పూర్తి కావడం లేదని శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు (స్టూడెంట్స్) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించి బోధనలో అవాంతరాలు లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

డైట్.. దయనీయం!

ఉర్దూ మీడియానికి ముగ్గురే..

ఈ కళాశాలలో ఉర్దూ మీడియం బోధించేందుకు ముగ్గురు ఉపన్యాసకులు మాత్రమే ఉన్నారు. ఉర్దూ బోధించే వారు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. మరో ఇద్దరు గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు. ఉర్దూ బోధించే లెక్చరర్లు లేక ఆ మీడియంలో డీఎడ్ శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉర్దూ మీడియం డీఎడ్ కోర్సులో కొనసాగుతున్న వారిలో ఉమ్మడి జిల్లా ఛాత్రోపాధ్యాయులే కాకుండా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు సైతం ఉన్నారు. ఉర్దూ మీడియంలో బోధించేందుకు ఈ డైట్‌లో ఐదుగురు రెగ్యులర్ సీనియర్ ఉపన్యాసకులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే కొనసాగుతున్నారు.

రెగ్యులర్ అధ్యాపకులు లేక ఇక్కట్లు

- తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌లో డైట్ కోర్సు
- మొత్తం 29 పోస్టులకు ఒక్కరే రెగ్యులర్
- 225 మందికి ఏడుగురే బోధనా సిబ్బంది
- ఇబ్బందుల్లో ఛాత్రోపాధ్యాయుల శిక్షణ
- గెస్ట్ లెక్చరర్లతోనే విద్యా బోధన
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వికారాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ లెక్చరర్లు లేక ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయుల(స్టూడెంట్స్) శిక్షణ అగమ్యగోచరంగా మారింది. భావి తరాలను సుశిక్షితులైన దేశ పౌరులుగా తీర్చిదిద్దే ఛాత్రోపాధ్యాయులకు బోధించే అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో శిక్షణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. సబ్జెక్టుల వారీగా సరిపడా అధ్యాపకులు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులుగా నియామకమైన తర్వాత తరగతి గదుల్లో విద్యార్థులకు చదువులు చెప్పాల్సిన వారి(డైట్ స్టూడెంట్స్) చదువులు ఈ విధంగా కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం సీట్ల సంఖ్యం 300

ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్ కళాశాల) వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉంది. ఈ కళాశాలలో డీఎడ్ కోర్సు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో కొనసాగుతోంది. ఒక్కో మీడియంలో 50 మంది విద్యార్థుల చొప్పున ఏటా 150 మందిని చేర్చుకుంటున్నారు. ఈ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరాలు కలిపి మొత్తం 300 మంది ఛాత్రోపాధ్యాయులకు ప్రాథమిక విద్యా బోధనలో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం 225 మంది ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. సరిపడా ఉపన్యాసకులు(లెక్చరర్లు) లేక ఛాత్రోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యా శిక్షణలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న వికారాబాద్ డైట్‌లో రెగ్యులర్ లెక్చరర్లు లేక క్రమంగా తన ఖ్యాతిని కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్ అధ్యాపకుల నియామకమైతేనే డైట్‌కు పూర్వవైభవం వచ్చే పరిస్థితి ఉంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు కోరుతున్నారు.

తొమ్మిది మంది నియామకానికి అనుమతి

డైట్ కళాశాలలో మొత్తం 29 పోస్టులు ఉండగా.. ఒక్కరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియాల్లో ఛాత్రోపాధ్యాయులకు విద్యా బోధన చేసేందుకు ఒక ప్రిన్సిపాల్ పోస్టుతో పాటు ఏడుగురు సీనియర్ లెక్చరర్లు, 16 మంది లెక్చరర్లు, 5 మంది ఉర్దూ మీడియం లెక్చరర్లు అవసరం. అయితే ప్రస్తుతం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఒక్కరు మాత్రమే రెగ్యులర్ సీనియర్ లెక్చరర్‌గా ఉన్నారు. ఆయన ఛాత్రోపాధ్యాయులకు విద్యా బోధనతో పాటు ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల వరకు డైట్‌లో ఇద్దరు సీనియర్ అధ్యాపకులు ఉండగా, గత నెలలో ఒకరు ఉద్యోగ విరమణ చేయగా, ప్రస్తుతం ఒక్కరు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకుడు ఉన్నారు. ఛాత్రోపాధ్యాయులకు విద్యాబోధనలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఏడుగురు రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాళ్లు, సీనియర్ ఉపన్యాసకులను గెస్ట్ ఫ్యాకల్టీ కింద నియమించి విద్యా బోధన కొనసాగిస్తున్నారు. ఈ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కింద తొమ్మిది మందిని నియమించుకునేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. 9 పోస్టులకు అర్హులైన అతిథి అధ్యాపకుల నియామకం కోసం ఇటీవల ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సుశీందర్‌రావు గురువారం తెలిపారు. స్కాలర్‌షిప్ పరీక్షకు రుసుం ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రూ.50, బీసీ, జనరల్ విద్యార్థులకు రూ.100 అన్నారు. ఎస్‌బీఐ ద్వారా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఇచ్చి వచ్చే నెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

'కస్తూర్బా' టీచర్ల మార్పునకు అవకాశం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: జిల్లాలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో తాత్కలిక పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు, స్పోర్ట్స్, పీఈటీలు, ఏఎన్ఎం, సీఆర్‌టీఎస్ ఇతర కేజీబీవీలకు బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈవో గురువారం సుశీందర్‌రావు తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నాటికి రెండేళ్ల సంవత్సరాలు ఒకే పాఠశాలలో పనిచేసిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 23వ వరకు దరఖాస్తులను సమర్పించాలని, ఈ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందని ఆయన కోరారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

- విధుల్లో ఉండగా ఘటన

కడ్తాల్, ఆగస్టు 22: విధుల్లో ఉన్న పోలీసుహెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన కడ్తాల పోలీసుస్టేషన్‌లో చోటుచేసుకుంది. కడ్తాల సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కల్యాణం మల్లయ్య(51) బుధవారం ఉదయం 9గంటలకు విధులకు హాజరయ్యాడు. రాత్రి 12:50 గంటలకు ఊపిరి ఆడడం లేదని తోటిసిబ్బంది తో తెలిపారు. కొద్ది సేపటికి ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలి పోయాడు. వెంటనే అధికారులు, సిబ్బంది ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుపోయి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని డీఆర్‌డీఏ అపోలో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మల్లయ్య గుండెపోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య 2016 నుంచి కడ్తాల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానం చూరగొన్నారు. ఆయనకు భార్య విజయ రాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మల్లయ్య మృతికి శంషాబాద్ డీసీపీ రాజేశ్ సంతాపం తెలిపారు. బడంగ్‌పేటలోని ఆయన నివాసంలో మల్లయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, ఏఎస్ఐలు నిరంజన్, ప్రసాద్‌జీ, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.





మల్లయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డీసీపీ రాజేశ్ (ఇన్‌సెట్‌లో) హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య(ఫైల్)

కాంగ్రెస్ పాలనలో కళ తప్పిన చేవెళ్ల

- కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు షాబాద్, చందనవెల్లి, హైతాబాద్, సీతారాంపూర్ అంటే ప్రపంచం మొత్తం తెలిసింది
- చేవెళ్లలో తయారైన రైలు డబ్బాలు వందేభారత్‌కు పోతున్నాయ్
- పార్టీ మారిన ఎమ్మెల్యే కాలె యాదయ్యను నిలదీయండి
- రైతుదీక్ష సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సభలో మాట్లాడుతున్న సబిత, ప్లకార్డు ప్రదర్శిస్తున్న కేటీఆర్

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, ఆగస్టు 22 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేవెళ్ల కళ తప్పిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా గురువారం చేవెళ్లలో నిర్వహించిన రైతు దీక్షకు ఆయన హాజరయ్యారు. అంతకుముందు మండల కేంద్రంలో రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఎన్నికకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా సీఎం కేసీఆర్ పాలనలో చేవెళ్ల ప్రాంతం ప్రపంచం మొత్తంగా తెలిసేలా షాబాద్, చందనవెల్లి, హైతాబాద్, సీతారాంపూర్ ప్రాంతాల్లో పెద్ద పెద్ద పరిశ్రమలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేవెళ్ల కళ తప్పిందన్నారు. చేవెళ్లలో తయారైన రైలు డబ్బాలు నేడు వందేభారత్‌కు వెళుతున్నాయని చెప్పారు. చందనవెల్లిలో తయారైన కార్పెట్లు సిలాకాన్ దేశానికి ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. ఇదంతా కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రియల్ ఎస్టేట్ ఆగమై పోతుందని చెప్పారు. ఈ విషయాన్ని షాబాద్ రైతు రవీందర్‌రెడ్డి తన దృష్టికి తీసుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. రుణమాఫీ చేస్తామని అనేక దేవుళ్ల మీద ఒట్లేసి, చేయకుండా సీఎం దైవ ద్రోహానికి పాల్పడ్డారని ఆరోపించారు. టీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయ్యను అడుగడునా నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. కాలె యాదయ్య ఏం సాధించేందుకు పార్టీ మారిండో అడగాలన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ పేరు వినబడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. చినుకులు పడితే చాలు రైతుల అకౌంట్లోకి టింగ్ టింగ్‌మంటూ రైతు రుణమాఫీ అకౌంట్లో జమ అయ్యేవని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లేసి రైతులను, ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రుణమాఫీ వంద శాతం కాని వారు వివరాలను గ్రామాల వారిగా సేకరించి జాబితా తయారు చేసి చేవెళ్లలోని ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద ఉంచి సీఎం ఇటుగా వెళ్లే సమయంలో రేవంత్‌రెడ్డికి అందజేస్తామన్నారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దొంగల పార్టీ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు మాటలు మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, విద్య, మౌలిక వసతుల కమిషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు స్వప్న, చిలకమర్రి నర్సింహ, కొంపల్లి అనంతరెడ్డి, దేశమొల్ల అంజనేయులు, నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, నర్సింగ్‌రావు, నాయకులు యాదగిరి, రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రైతుదీక్ష సభకు హాజరైన జనం

కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిక

కేటీఆర్ సమక్షంలో అల్లాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, ఆలూరు మాజీ ఉప సర్పంచ్ కసిరె వెంకటేష్, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మెడికల్ కాలేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : మెడికల్ కాలేజీ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మహేశ్వరం మెడికల్ కాలేజీ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరంలోని మెడికల్ కాలేజీలో జరగాల్సిన ఫస్ట్ లెవల్ నియామకాలు పూర్తి చేశామన్నారు. ఇంకా జరగాల్సిన నియమకాలు పూర్తిచేసే విధంగా కాలేజీ ప్రిన్సిపాల్ చర్యలు చేపట్టాలన్నారు. సివిల్ పనులు, సిబ్బంది నియామకం, ల్యాబ్‌లు, హాస్టల్ వసతులు తదితర పనులన్నీ కాలపరిమితిని నిర్ణయించుకొని పూర్తి చేసేలా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఇన్ ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీరాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ త్రివేణి, సూపరింటెండెంట్ బి.నాగేందర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త జి.రాజుయాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ ప్రారంభం..

జిల్లా 'ఈ-ఆఫీస్'ను కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఇక కాగితాలు, ఫైళ్లు ఉండవని, అంతా ఎలక్ట్రానిక్ సిస్టమ్ ద్వారా కార్యక్రమాపాలు సాగుతాయన్నారు. ప్రస్తుతం మొదటి విడతగా వ్యవసాయ, ముఖ్య ప్రణాళిక శాఖల కార్యాలయాలు, పంచాయతీ రాజ్, మైనారిటీల సంక్షేమ, మహిళా శిశు, మెప్మా, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్, ఎస్సీ అభివృద్ధి, డీఆర్‌డీఏ శాఖలతో ప్రారంభించడం సంతోషమని తెలిపారు. ఇప్పటి నుండి ఈ శాఖల్లో ప్రతి ఫైల్‌ను 'ఆన్‌లైన్'లోనే పంపాలని తెలిపారు. ఇంకా మిగిలిన జిల్లా అధికారులు కూడా వచ్చే మూడు నెలల్లోగా ఈ-ఆఫీస్‌ను అమలు చేయాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతీ శాఖ ఈ మూడు నెలల కాల వ్యవధిలో ఈ-ఆఫీస్ అమలుకు చర్యలు తీసుకోవాలని డీఐవో, ఎన్ఐసీ అధికారులను ఆదేశించారు. సదరు ఉద్యోగి, అధికారి మాస్టర్ డేటాకు లింక్ అయి ఉంటాయని కలెక్టర్ శశాంక తెలిపారు. దీంతో ఎక్కడా ఆ ఫైల్‌ను దారి తప్పించడానికి ఎవరికీ అవకాశముండదని అన్నారు. అలాగే సదరు ఉద్యోగికి నెట్ కనెక్షన్ ఉంటే చాలు... ఇంటి నుంచైనా పని చేయవచ్చని తెలిపారు. అత్యవసర సమయంలో అందుబాటులో లేనప్పుడు ఇంటి వద్ద నుంచి పని చేసేందుకు ఈ-ఆఫీస్ విధానం ఉపయోగంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఫైళ్ల స్థితిగతులనుపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకునే వీలుంటుందని, అధికారులు తమ మొబైల్ ఫోన్‌లోనే ఫైల్‌ను ట్రాక్ చేయవచ్చన్నారు. ఎక్కడైనా ఫైల్ ఆలస్యమైతే అందుకు గల కారణాలపై ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ విధానంలో ఫైల్ వేగంగా కదులుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, సీపీవో సౌమ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, మైనార్టీ శాఖ అధికారి నవీన్ కుమార్‌రెడ్డి, డీసీసీవో ధాత్రిదేవి, ఈడీఎం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ మేనేజర్‌గా గోపీకృష్ణ

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : జిల్లా పౌర సరఫరాల మేనేజర్‌గా ఎం.గోపీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ శశాంకను మర్యాద పూర్వకంగా కలిశారు. యాదాద్రి జిల్లాలో ఆరేళ్లు విజయవంతంగా విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అందరికీ అందుబాటులో ఉంటూ బాధ్యతయుతంగా పనిచేస్తానని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి బియ్యాన్ని ఎఫ్‌సీఐ/సీఎస్‌సీకి గడువులోగా తరిచేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపీకృష్ణ

ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలి

కేశంపేట, ఆగస్టు 22: విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పని భారాన్ని తగ్గించాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం కేశంపేట, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ, వేముల్‌నర్వ, కొండారెడ్డిపల్లి, కాకునూర్, నిర్దవెల్లి, పీఎస్ కొండారెడ్డి గ్రామాల్లోని స్కూళ్లలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కువున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందని, కొన్నిచోట్ల వందల్లో విద్యార్థులున్న చోట్ల టీచర్లు తక్కువ మంది ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీకి ముందే రేష్నలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని అన్నారు. విద్యా వ్యవస్థలోని సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి, జంగయ్య, హరి ప్రసాద్, గోవర్ధన్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

బొంరాస్‌పేట్, ఆగస్టు 22: గ్రామాల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులకు సంబంధించిన ఫైల్‌లను తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలు గ్రామాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీకెమెరాల ఏర్పాటుతో ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు నేరస్థులను సులభంగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్డుప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేస్తామని, ప్రతీఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అంతకు ముందు ఎస్పీ నారాయణరెడ్డి పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్, ఏఎస్ఐ కమాల్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

రేపు ఆర్వోఆర్ యాక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి: ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న కొత్త ఆర్వోఆర్ (రికార్డు ఆఫ్ రైట్స్)యాక్టు-2024పై శనివారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. కొత్తగా తీసుకువస్తున్న చట్టానికి సంబంధించిన ముసాయిదా ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై ప్రజల నుంచి విస్తృత అభిప్రాయ సేకరణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్ర, శనివారాల్లో ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్‌షాపు నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశించింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో శనివారం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నారు. రైతులు, రెవెన్యూ అధికారులు, మాజీ రెవెన్యూ అధికారులతో పాటు మేధావుల అభిప్రాయాలను కూడా తీసుకుంటారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా ఆహ్వానించారు.

రేపు జాబ్‌మేళా

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 24న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జయశ్రీ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు మేళా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈ-కామర్స్ బీపీవో రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ అండ్ డిప్లొమా, జీఎన్‌ఎం, ఎఎన్‌ఎం, బి-ఫార్మసీ పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18 ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. వివరాలకు 9063099306 ఫోన్ నంబర్లో సంప్రదించాలనా సూచించారు.

108లో నియామకాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: ఈఎంఆర్ఐ (108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. నియామకాల ఇంటర్వ్యూలు కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోదలచిన వారి వయసు 23-35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోదలచిన అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. డీ ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర ఆరోగ్య శాఖకు సంబంధించిన డిప్లమా చదివి ఉండాలన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జత జిరాక్స్ సెట్‌ను తీసుకురావాలని తెలిపారు.

తాండూరు మున్సిపల్ డీఈఈగా మణిపాల్

తాండూరు, ఆగస్టు 22: తాండూరు మున్సిపల్ డీఈఈగా మణిపాల్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసిన ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా తాండూరు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన డీఈ రంగానాథం మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ ఆరేళ్లు ఇన్‌చార్జి డీఈఈగా కొనసాగారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివా‌స్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 22 : పేదల ఆరోగ్య పరిరక్షణకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుండూరుకు చెందిన తిరుపతయ్యకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అన్నిరకాల వైద్య చికిత్సలు అందించాలని కోరారు. వానకాలంలో వ్యాధులు ప్రబలుతున్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నాయకులు నాగులు, సతీష్, సుభాష్, నర్సింహ, యాదగిరి, సుమన్, గణేశ్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయానికి వైకుంఠ ద్వారం



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22 : షాద్‌నగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి అష్టలక్ష్మి ప్రతిమలతో వైకుంఠద్వారాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల విరాళాలతో ఏర్పాటు చేసిన ఈ ద్వారాన్ని శుక్రవారం ఉదయం 8.35గంటలకు ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కోరారు.

పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి



ఓటరు జాబితా సవరణపై సమీక్షిస్తున్న అధికారులు

బషీరాబాద్, ఆగస్టు 22: అర్హులైన ప్రతీఒక్కరికి చోటు కల్పిస్తూ ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించాలని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో గాలి యాదయ్య అన్నారు. బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో వారు సమీక్షించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరు జాబితాలో పేరుండేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో సవరణ కోసం రాజకీయ పార్టీల నాయకులు తమ వంతుగా సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీవో బాలగంగాధర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌నాయక్



సేవలాల్‌సేన జిల్లా కార్యవర్గం వీరే

పరిగి, ఆగస్టు 22: సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా కులకచర్ల మండలం దాస్యానాయక్‌తండా మాజీ సర్పంచి జటావత్ శంకర్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని సంతునిరంకారి సత్రంలో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌నాయక్, కార్యదర్శి మోహన్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాజు నాయక్, వినోద్‌నాయక్, సేవలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడు తిరుపతి, రైతుసేన జిల్లా అధ్యక్షుడు చంద్రనాయక్, ఉపాధ్యక్షుడు పాండు, పరిగి నియోజకవర్గం ఇన్‌చార్జిగా తులసీరామ్, జిల్లా సేవలాల్ ధర్మజాగరణ అధ్యక్షుడు కిషన్‌స్వామి, ఉపాధ్యక్షుడిగా కేశ్యానాయక్‌నాయక్, కోశాధికారిగా విష్ణునాయక్, కులకచర్ల మండల ఇన్‌చార్జి అంగూర్‌నాయక్, దోమ మండల ఇన్‌చార్జిగా సూర్యనాయక్, కొడంగల్ ఇన్‌చార్జిగా హరి, చౌడాపూర్ మండల ఇన్‌చార్జిగా అజయ్‌నాయక్‌లకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో గిరిజన సింహగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయితీలుగా ఉన్న తండాల పరిధిలోని ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పల్లె పోరుకు సై



- ఓటర్ జాబితాలకు కసరత్తు
- వచ్చే నెలలో ప్రక్రియ
- తాండూరు సెగ్మెంట్‌లో 161 పంచాయతీలు
- కొత్త పంచాయతీల్లో ఎన్నికలపై లేని స్పష్టత

తాండూరు, ఆగస్టు 22: గ్రామపంచాయతీ వార్డు విభజన ప్రక్రియను ప్రభుత్వ అధికార యంత్రాంగం చేపట్టనుంది. ఇందుకుగానూ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో 20 ఫిబ్రవరి 2024 ఆమోదించబడిన ఫొటోలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి ప్రక్రియను సెప్టెంబర్ 6 నుంచి చేపట్టాలని తాజాగా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో గ్రామస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఊపందుకోనుంది. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాలు కలిపి 161గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చే నెల 6 నుంచి 21వ తేదీ వరకు ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ప్రక్రియకు సంబంధించి స్పష్టత లేదు. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా 12గ్రామ పంచాయతీలు ఏర్పడిన విషయం విదితమే. సెప్టెంబర్ 6న గ్రామపంచాయతీల ఎలక్టోరోల్స్ తయారీ, ప్రచురణ దశ, పంచాయతీలు, వార్డు డివిజన్‌ను సక్రమంగా సూచి స్తూ గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఓటరు జాబితా ప్రచురణ, 10న రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఎంపీడీవో స్థాయిలో అభ్యంతరాలపై సమావేశం, సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, వార్డు, గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో అసెంబ్లీ ఓటర్ల అభ్యంతరాలు, సవరణలుంటాయి. 19న వచ్చిన అభ్యంతరాలపై సమీక్షించి తొలగిస్తారు. 21న వార్డు డివిజన్ సక్రమంగా సూచించే ప్రచురణతో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మార్గం సుగమం అయినట్లు చెప్పవచ్చును. బీసీ రిజర్వేషన్ల ఓటర్ జాబితా ప్రకారం చేపడుతారా? లేదా? అన్నది స్పష్టం చేయాల్సి ఉంది.





బోనాలతో తరలుతున్న గ్రామస్తులు, బోనాల ఊరేగింపులో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్‌లో వైభవంగా పోచమ్మ బోనాలు



ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్

కొత్తూర్, ఆగస్టు 22: కొత్తూర్ మున్సిపాలిటీలో గురువారం రాత్రి మైసమ్మ బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవతలను పునఃప్రతిష్ఠించి బోనాల పండుగను నిర్వహించారు. పెంజర్ల రోడ్డులోని మందోనిమైసమ్మ ఆలయం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మైసమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు నెత్తిపై బోనాల పెట్టుకొని మేళతాళాల మధ్య ఆలయాలకు చేరుకున్నారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బి.దేవేందర్‌యాదవ్, ఇందారి శ్రీనివాస్ సొంత ఖర్చుతో పలహార బండిని ఏర్పాటు చేసి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూజల అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు లావణ్యదేవేందర్‌యాదవ్, కె.నరేందర్, రాజకీయ పార్టీల నాయకులు సదానంద్‌గౌడ్, జె.సుదర్శన్‌గౌడ్, నర్సింహాగౌడ్, దేవేందర్, జె.శ్రీను, యాదయ్య, కృష్ణయ్య, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, బి.కృష్ణ, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వెంకటయ్య, హరిప్రసాద్, రాము తదితరులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 22: ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల వేడుకలకు ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సురసముద్రం చెరువు కట్టపై కట్టమైసమ్మ ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ముదిరాజ్ సంఘం నాయకులు, మత్స్యకారులు, భక్తులు, మహిళలు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల రెండోరోజు గురువారం అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో షోడష స్తంభ పూజ, స్థాపితహవన పూజలు నిర్వహించారు. బాల బ్రహ్మచార్యులు, బసవేశ్వరశాస్త్రి, నాగరాజుశర్మలు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలితవెంకటయ్య, సంఘ సేవకుడు రాముశ్వేత, ఎస్సై బి.వెంకటేశ్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, నాయకులు ఎర్రవోలు యాదయ్య, చిన్న వెంకటయ్య, అంజయ్య, రాజు, శ్రీనివాస్, ఆంజనేయులు, మల్లేశ్, సాయి, మహేశ్, వెంకటేశ్, మల్లేశ్, శివ, బాలమణి, యాదమ్మ, వెంకటమ్మ, మల్లేశ్, రమేశ్, శ్రీశైలం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మేడ్చల్ నూతన కార్యవర్గం



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: పీఆర్‌టీయూ మేడ్చల్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రజిత, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.తవిటి నాయకుడు, ఉపాధ్యక్షులుగా వి.హరీష్, బి.లతశ్రీ, మహిళా కార్యదర్శిగా వెంకటరత్నం, కార్యదర్శిగా కె.జగదీష్, టి.హరీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాట్ల డాక్యుమెంట్ల రెగ్యులరైజ్‌కు చర్యలు



దరఖాస్తులను పరిశీలిస్తున్న టీపీవో మణిహారిక, అధికారుల బృంధం

శామీర్‌పేట, ఆగస్టు 22: 2020 వరకు లేఅవుట్లలో, వెంచర్‌లలో హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండా కొనుగోలుచేసి రెగ్యులరైజ్ చేసుకోని అర్హత గల ప్లాట్లను రెగ్యూలరైజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తూంకుంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) మణిహారిక అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో గల ఎస్ఎన్ఆర్ వెంచర్‌లో మున్సిపల్ టీపీవో ల్యాండ్ రెగ్యూలరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) ధరఖాస్తుల, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణ ప్రక్రియను(ఎల్ఆర్ఎస్ మేళా) ప్రారంభించారు. దీంతో ఎస్ఎన్ఆర్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ మేళా వద్దకు తూంకుంట మున్సిపల్ పరిధిలో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా, రెగ్యూలరైజ్ చేయకుండా కొనుగోలు చేసిన పలువురు ప్లాట్ల యజమానులు వచ్చారు. ఈ ఎల్ఆర్ఎస్ మేళాను మున్సిపల్ టీపీఓ మణిహారిక ఆధ్వర్యంలో మండల అధికారుల బృందం మండల ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కవితలు నిర్వహించారు. కాగా మొదటిరోజు గురువారం మున్సిపల్ పరిధిలోని దాదాపు 25 మంది ప్లాట్ల యజమానులు తీసుకవచ్చిన 2020 వరకు దరఖాస్తులు చేసుకున్న ఎల్ఆర్ఎస్ డ్యాకుమెంట్లను టీపీవో అధికారుల బృందం క్షుణ్ణంగా విచారణ జరిపి పరిశీలించారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను కూడా టీపీవో నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా టీపీవో మణిహారిక మాట్లాడుతూ.. తూంకుంట మున్సిపల్ పరిధిలో 2020 వరకు దాదాపు 4853 మంది యజమానులు వివిధ వెంచర్లు, లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకు ఈ ప్లాట్లను మూడు దశల్లో అధికారుల బృందాలు ప్లాట్ల డ్యాకుమెంట్లను, ప్లాట్ల స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేయనున్నట్లు టీపీవో వెల్లడించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్లను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా తాము రెగ్యూలరైజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు టీపీవో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం మున్సిపల్ పరిధిలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని టీపీవో వెల్లడించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు వినియోగించుకోవాలని టీపీఓ పిలుపు నిచ్చారు.

నిరుద్యోగులు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కృష్ణ

దోమ, ఆగస్టు 22: నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారంఅంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి స్వర్ణభారతి ట్రస్టు ముచ్చింతల్‌లో 19-45 సంవత్సరాల్లోపు యువతీ యువకులు వివిధ కోర్సుల్లో అందిస్తున్న శిక్షణపై అవగాహన కల్పించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, వసతి, దుస్తులను అందించడంతో పాటు శిక్షణ అనంతరం మినిస్ట్రీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89198 56113 నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, వైద్యురాలు రజిత, సీహెచ్‌వో విజయలక్ష్మి, ప్రభులింగం, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్

పరిగి, ఆగస్టు 22: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని పరిగి ఎస్ఐ సంతోష్ అన్నారు. అంకిత సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని నస్కల్‌లోని కేజీబీవీ స్కూల్‌లో గురువారం మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు వేధించినా అనుమానితులుగా కనిపించినా 100 డయల్‌కు కాల్ చేయాలని సూచించారు. బాలకార్మికులు, బాల్యవివాహాల సమాచారాన్ని 1098కు తెలపాలన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాఫియాసుల్తాన్, సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.ప్రకాశ్, ఏహెచ్‌టీయూ అధికారి అలీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్షిస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు

షాద్‌నగర్, ఆగస్టు 22: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలను వేగవంతం చేయాలని షాద్‌నగర్ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ వెంకటమాధవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్‌కు 12వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్లాట్లను తనిఖీ చేసిన తర్వాతనే ఆయా దరఖాస్తులను ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. ప్రభుత్వ, భూదాన్, శిఖం భూములేమైనా ఉన్నాయా? అని పరిశీలించాలని సూచించారు. అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేయొద్దని అన్నారు. అలాగే షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. నందిగామ మండలంలో 33, కొత్తూరులో 33, ఫరూఖ్‌నగర్ మండలంలో 34 చెరువులు, కుంటలు ఉన్నాయని తెలిపారు. అవి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, నీటి పారుదుల, కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని తెలిపారు.

కాలుష్యంతో కుర్వగూడ వాసుల ఇబ్బందులు



పంచాయతీ కార్యదర్శికి వినతిప్రతం ఇస్తున్న గ్రామస్తులు

షాబాద్, ఆగస్టు 22: ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లికట్ట సమీపంలో ఉన్న కంపెనీల నుంచి వస్తున్న కాలుష్యం కుర్వగూడ గ్రామంపై ప్రభావం చూపుతోందని, కాలుష్యకారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కుర్వగూడ వాసులు గురువారం పంచాయతీ కార్యదర్శి పర్వీన్‌బేగంకు వినతిప్రతం ఇచ్చారు. వారు మాట్లాడుతూ... కుర్వగూడకు దగ్గరలో ఉన్న అనేక కంపెనీలతో గాలి, నీటి కాలుష్యం వస్తోందనన్నారు. ప్రమాదకర గ్యాస్‌లు, దుర్వాసనతో ప్రజలకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు వచ్చాయన్నారు. నీరు రంగు మారి దుర్వాసన వస్తోందన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయి కంపెనీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాదె హరీష్, రాము, మల్లేష్, మహేష్, శ్రీనివాస్, అమరేష్, సునీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో విలీనాన్ని సవాల్ చేస్తూ పిటిషన్

శంషాబాద్ రూరల్, 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషరేట్ పరిధిని విస్తరించేందుకు తలంచింది. ఇందులో భాగంగా ఔటర్‌రింగ్ రోడ్డు పరిధి మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలను జీహెచ్ఎంసీలో వీలినం చేస్తున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ జీవోను విడుదల చేశారు. దీన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చిన్న గోల్కొండ మాజీ సర్పంచ్ పద్మావతిఅనంతరెడ్డి హమీదుల్లానగర్, పెద్ద గోల్కొండ, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల తరపున హైకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ముందు పిటిషనర్ తరపున అడ్వకేట్ రఘునాథ్ గురువారం వాదనలు వినిపించారు. పంచాయతీల తీర్మానాలు లేకుండా జీహెచ్ఎంసీలో వీలినంతో రైతులు, రైతు కూలీలు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతారన్నారు. ఉపాధి హామీ వంటి పథకాలు వారికి వర్తించవని, ఉపాధిని కోల్పోతారని తెలిపారు. వాదనలపై జస్టిస్ వినోద్‌కుమార్ స్పందిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా జీవో విడుదల చేసినట్లు గుర్తించి, అధికారుల నుంచి వివరణ కోరారు. నాలుగు వారాల్లో కోర్టుకు వివరణ సమర్పించాలని ధర్మాసనం పేర్కొందని పిటిషనర్ల న్యాయవాది తెలిపారు.

రుణమాఫీపై రైతులను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్



ఇబ్రహీంపట్నంలో రైతు ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేస్తోందని బీఆ ర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా రైతులకు రుణమాఫీ చేయాలని గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తా సాగర్ ప్రధాన రహదారిపై జరిగిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డు లేని వారికి, ఆధార్ మ్యాచ్ కావడంలేదని ఇలా పలు కొర్రీలు పెట్టి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు ఒకే సారి రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటన చేసినా అది ఏ కోశానా అమలు కాలేదన్నారు. ప్రతిపక్షాలపై ఎదురుదాడి కాకుండా ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, యాదగిరి, కృపేష్, బుగ్గరాములు,, చంద్రయ్య, ప్యాక్స్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల: బీఆర్ఎస్ నాయకులు, రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మాడ్గుల మండల మాజీ వైస్‌ప్రెసిడెంట్ కొర్ర శంకర్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణతల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



చౌదరిగూడలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రుణమాఫీ చేస్తానని తప్పిన సీఎం డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లాలయ్యగౌడ్, మాజీ



షాద్‌నగర్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనచారి

ఎంపీపీ జైపాల్‌నాయక్, నిరంజన్, ఆరోగ్యరెడ్డి, చెన్నయ్య, రాజుగౌడ్, యాదయ్య, బద్యానాయక్, అనిల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ: ప్రభుత్వం ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారి జగదీశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బాబూరావు, వెంకటేష్, యాదయ్య, నర్సింలు, బాల్‌రాజ్, శేఖర్, మాణెయ్య, పాండు, గోపాల్, గణేష్ పాల్గొన్నారు.

మహేశ్వరం: రుణమాఫీలో ప్రభుత్వం విఫలమైందని మహేశ్వరం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ ధర్నా నిర్వహించింది. ధర్నాలో నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, కె.చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, దేవ్లానాయక్, శ్రీనివాస్, నవీన్, కృష్ణ, సలీమ్, నందం, రవీనా, సాదత్, రాయప్ప పాల్గొన్నారు.

కడ్తాల్: కడ్తాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీకి వినతిపత్రం ఇచ్చారు. రుణమాఫీపై ప్రభుత్వం మాటతప్పిందని మండిపడ్డారు. 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆనంద్, మంజులచంద్రమౌళి, గోపాల్, ప్రియారమేశ్, లచ్చిరాంనాయక్, జోగు వీరయ్య, మంగళపల్లి నర్సింహ, సాయిలు, హరిచంద్‌నాయక్, దేవనాయక్, రామకృష్ణ, కృష్ణ, పాండు, శంకర్, శ్రీకాంత్, శ్రీను, అంజి పాల్గొన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. రహదారిపై బైఠాయించారు. పూర్తిగా రుణమాఫీచేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ నర్సింహ, ముజుబుర్ రహెమాన్, గోపాల్‌నాయక్, జ్యోతయ్య, ఈశ్వర్, రాములు, శంకర్‌నాయక్, యాదయ్య, శేఖర్, నరోత్తమ్‌రెడ్డి, నర్సింహ, సజ్జుపాషా, శేఖర్‌యాదవ్, రవి, మల్లేశ్, పాండు, యాదయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: దేవుళ్లపై ప్రమాణం చేసి మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసగించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లులో అర్జున్‌రావు మాట్లాడుతూ రైతులను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేటముంచుతోందని మాజీ స్పీకర్ మధుసూదనచారి అన్నారు. రూ.17,500కోట్లు రుణమాఫీ చేశామని



రైతులందరికీ రుణమాఫీ చేయాలని మహేశ్వరంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెబుతున్న ప్రభుత్వం వాస్తవానికి మాత్రం రూ.7,500కోట్లు మాత్రమే రుణ మాఫీ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.1.2లక్షల కోట్ల రైతుబంధు, రైతుబీమా కింద వెచ్చించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో అంకెలు చూపుతూ, వాస్తవ లెక్కలను చెప్పడంలేదన్నారు. మాజీఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు మధుసూదనచారి హాజరయ్యారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు హామీలను నెరవేర్చడం లేదన్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. 10ఏళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణను దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపితే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తోం



తలకొండపల్లి ధర్నాలో మాట్లాడుతున్న సీఎల్.శ్రీనివాస్‌యాదవ్

దని అన్నారు. అంజయ్య మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి తనకు ఎలాంటి రుణాలు లేవని, కాంగ్రెస్ నేతలు మాత్రం తనకు రుణ మాఫీ జరిగిందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు రుణ మాఫీ జరిగిందని ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. ధర్నాలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్‌చైర్మన్ నటరాజన్, కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్ పాల్గొన్నారు.



మాడ్గులలో కార్యాలయం వద్ద నాయకుల ధర్నా



కడ్తాలలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కంబాల పరమేశ్, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్న రైతులు

రుణమాఫీపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకుడు పాండుగౌడ్

మాడ్గుల, ఆగస్టు 22: బీఆర్ఎస్ పాలనలో రైతులకు రైతుబంధు పేరిట వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు రైతుల కోసం పని చేస్తున్న కాంగ్రెస్ నేతలపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మాజీ ఎంపీటీసీ కొత్త పాండుగౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సాగుకు సబ్సిడీ అనేదే లేకుండా చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కపట నాటకం ఆడుతున్నారన్నారు. వేల ఎకరాలున్న భూస్వాములకు ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం పంటల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. రైతులకు 2 లక్షల మాఫీచేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.

గన్‌పార్క్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు, ఆగస్టు 22 : అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని, సెబీ చైర్మన్ అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి అనంతరం వాహనాల్లో గన్‌పార్క్‌కు వెళ్లారు. అదానీ, ప్రధానిమోదీ దేశాన్ని దోచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ కాంగ్రెస్ గొంతు నొక్కుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్ ఉన్నారు.

పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న నాయకుడు బాల్‌రాజ్

కందుకూరు, ఆగస్టు 20: గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలు ఇచ్చి వారిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం 35గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వర్కర్లతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడారు. 45రోజుల క్రితం చేపట్టిన ధర్నాకు స్పందించి ఎండీవో సరిత తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు. నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులకు ఐడీ కార్డులు, మాస్కులు, బ్లౌజులు, సబ్బులు, దుస్తులను ఇవ్వాలన్నారు. ఎంపీవో గీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కారోబార్ నరసింహ, వర్కర్లు రాములు, యాదయ్య, జంగయ్య, మల్లేష్, శ్రీపాలు, జంగమ్మ, లక్ష్మమ్మ, రాధిక, సుమిత్ర, అలివేలు పాల్గొన్నారు.

రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డికి నివాళులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22 : విద్యాభివృద్ధే ధ్యేయంగా విద్యా సంస్థలు, వసతి గృహాలను నెలకొల్పి సేవలందించి, సామాజిక చైతన్యం తీసుకువచ్చిన కొత్వాల్ రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన 155వ జయంతిని పురస్కరించుకుని గురువారం షాద్‌నగర్ రెడ్డి సేవా భవనంలోని వెంకట్‌రాంరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి లేకపోయినా ఆయన నెలకొల్పిన విద్యా సంస్థలు, వసతి గృహాలు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు నేటికీ దోహదపడుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు ఎన్. నర్సింహ్మారెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిబడ, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజా బహద్దూర్ వెంకట్ రాంరెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సంఘం నాయకులు

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు



బొదనంపల్లిలో పోచమ్మ ఆలయానికి బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

కేశంపేట, ఆగస్టు 22 : మండల పరిధి బొదునంపల్లిలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిపై పెట్టుకుని ఆలయానికి తీసుకెళ్లారు. మేళ, తాళాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు సాగింది. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు పూన కాలతో మహిళలు ఊగిపోయారు. బోనాల పండుగాతో బొదునంపల్లిలో కొత్తశోభ సంతరించుకుంది. కార్యక్రమంలో నీల పాండు, రమేష్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, యెన్నం లింగా రెడ్డి, పిప్పళ్ల శేఖర్, వెంకటయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కందుకూరులో మైసమ్మ బోనాలు



కందుకూరులో బోనాలతో తరలుతున్న మహిళలు

కందుకూరు: కందుకూరులో పోచమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుతో ఆలయానికి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

సార్లరావులపల్లిలో ఆలయ పనులు ప్రారంభం

కందుకూరు, ఆగస్టు 22 : మండలంలోని సార్లరావులపల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన పనులను కనులపండువగా జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 6గంటల నుంచి వేద పండితుల సమక్షంలో హోమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజితప్రవీణ్‌నాయక్ మాట్లాడారు. మారుమూల గ్రామమైన సార్లరావులపల్లిలో అమ్మవారి ఆలయాన్ని గ్రామస్తులతో కలిసి నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు శీనునాయక్, భీమారావు, లక్పతినాయక్, కవితశ్రీరామ్, జోషి, సోమ్లానాయక్, సుమన్, శ్రీనివాస్, లచ్చీరాం, రాజేష్, హరిలాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్

హెడ్ కానిస్టేబుల్ మృతి తీరని లోటు

కడ్తాల్, ఆగస్టు 22: కడ్తాల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ కల్యాణం మల్లయ్య మృతికి బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. కడ్తాల బస్టాండ్ కూడలిలో గురువారం మల్లయ్యకు సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెడ్‌కానిస్టేబుల్‌గా మల్లయ్య అందించిన సేవలను వారు కొనియాడారు. మల్లయ్య మృతి పోలీసు శాఖకు, కడ్తాలకు లోటని మాజీ సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, బొప్పిడి గోపాల్, లచ్చిరామ్ నాయక్, చంద్రమౌళి, రమేశ్, సాయిలు, వీరయ్య, లాయక్‌అలీ, రామకృష్ణ, నర్సింహ, రాములు, యాదయ్య, బీక్యానాయక్, వెంకటేశ్, జంగయ్య, శ్రీను, శ్రీకాంత్, అంజి, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22: డ్రైవింగ్ శిక్షణ కోసం ఎస్సీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్య నిర్వాహక కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. హకీంపేట్‌లోని డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(డీటీఐ)మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో 30రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. 20సంవత్సరాలు పైబడిన ఎస్సీ యువత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. దరఖాస్తుదారులు మూడు పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర జిరాక్స్ పత్రాలను తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న చైర్మన్ నరేందర్ తదితరులు

షాద్‌నగర్అర్బన్, ఆగస్టు 22: షాద్‌నగర్ వినాయక గంజ్‌లోని విఘ్నేశ్వరుడికి సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజాలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు. మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, విశ్వహిందూ పరిషత్ ప్రాంత వాహ్ బండారి రమేష్, డాక్టర్ రవికుమార్, నర్సింహులుగుప్తా, పి.వెంకట సాయిశ్వర్‌రెడ్డి, ఓంప్రకాశ్ తదితర భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.రాధిక తదితరులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ విద్యార్థి తన వంతుగా కృషిచేయాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రాధిక అన్నారు. కళాశాల జాతీయ సేవా విభాగం, జాతీయ విద్య విషయక విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ ఒక్కరు కనీసం ఒక మొక్కైనా నాటి సంరంక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావన్నారు. వినాయకచవితి సందర్భంగా మట్టి వినాయకుల ప్రతిమలనే తయారు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, జాతీయ సేవా పథకం విభాగం అధికారులు డా.ఎస్.రమేష్, డా.చింతల రాకేష్ . భవాని, డా.రచన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

తలకొండపల్లి, ఆగస్టు 22: మెదక్‌పల్లిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కామినేని ఆసుపత్రి సహకారంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలో 155మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, నరేశ్, శంకర్, అశోక్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, అశోక్, రజినీకాంత్, పాండు, దయాకర్, మనోహర్, రాములు, శ్రీశైలం, నవీన్ పాల్గొన్నారు.

గ్రామానికి యువకుడి ఉదారత

● మూడు సింగిల్ ఫేజ్ మోటార్ల బిగింపు

కేశంపేట, ఆగస్టు 22: గ్రామంలో నీటి ఇబ్బందులు తీర్చేందుకు ఓ యువకుడు స్పందించాడు. సొంత డబ్బుతో మూడు సింగిల్ ఫేస్ మోటార్లను బిగించాడు. బొదునంపల్లిలో ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిప్పళ్ల శేఖర్ అనే యువకుడు గురువారం గ్రామంలోని మూడు బోర్లకు రూ.1.1లక్షలతో మూడు సింగిల్ ఫేజ్ మోటర్లను బిగించి ప్రారంభించారు. శేఖర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కా ర్యదర్శి సాయిప్రసాద్‌రెడ్డి, లింగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, పాండు, బాలరాజు, వెంకటయ్య, ఐలయ్య, తిరపతయ్య, పెంటయ్య, లింగయ్య, లక్ష్మయ్య, మల్లేష్, చెన్నయ్య, రవి గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, పద్మమ్మ, కళమ్మ, జయమ్మ పాల్గొన్నారు.



సింగిల్ ఫేజ్ మోటార్‌ను ప్రారంభిస్తున్న శేఖర్, గ్రామస్తులు

క్రైం కార్నర్

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితుడు, నాటు సారాతో ఎక్సైజ్ అధికారులు

ఆమనగల్లు, ఆగస్టు 22: ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో సిబ్బంది, అధికారులు టీంలుగా దాడులు చేపట్టారు.గంజాయి, నాటు సారా నివారణలో భాగంగా మూడు మండలాల్లో గ్రామాలు, తండాల్లో సోదాలు నిర్వహించారు. మైసిగండిలో, మైసమ్మ ఆలయం సమీపంలో దుకాణాలను సోదాలు చేశారు. ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. నాటు సారా విక్రయిస్తున్న ఆరుగురిని కడ్తాల తహసీల్దార్ ముంతాజ్ వద్ద బైండోవర్ చేశామన్నారు. తలకొండపల్లి మండలం తాళ్లగుట్టతండా, పడమటి తండాలో 50లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని బద్యానాథ్ చౌహాన్ హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ స్వప్న, సిబ్బంది శంకర్, దశరథ్, శ్రీజ, ప్రవీణ్, లోక్య, రాంరెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



గంజాయి తరలించిన కారు

యాచారం, ఆగస్టు 22 : గంజా యిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి పెద్దఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన యాచారం మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సాధారణ తనిఖీల్లో భాగంగా సాగర్ రహదారిపై తనిఖీ చేశారు. ఏపీ నుంచి హైదరాబాద్ వస్తున్న కారు(ఏపీ 39 హెచ్‌డబ్ల్యూ0623) పోలీసులను తప్పించుకు పోవడానికి ప్రయత్నించింది.పోలీసులు కారును ఆపి అందులో తనిఖీ చేశారు. అందులో గంజాయి లభించినట్లు తెలిసింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వివరాలు శుక్రవారం వెల్లడించనున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 22: మద్యానికి బానిసై అనారోగ్యానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పరిధిలో వెంకన్నగూడ తండాకు చెందిన పాత్లవత్ రవి(44) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. ఈ నెల 2న ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



అంజమ్మ

షాద్‌నగర్‌రూరల్ ఆగస్టు 22: షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి రాయికల్‌కు చెందిన అంజమ్మ(68)అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. 21న షాద్‌నగర్‌లో బంధువుల ఇంటి గృహప్రవేశానికి వచ్చి తిరిగి రాలేదని తెలిపారు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె కుమారుడు అంజయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

షాబాద్, ఆగస్టు 22: అదానీ కేసు దర్యాప్తులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... అదానీ కేసు దర్యాప్తులో కేంద్ర ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పొన్న వెంకట్‌రెడ్డి, రవీందర్‌నాయక్, రాఘవేందర్, రాజేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.